ప్రవేశాలు అంతంతే..!



- లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో తగ్గిన అడ్మిషన్లు

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో ఈ విద్యాసంవత్సరంలో అడ్మిషన్లకు పెద్దగా పోటీ కనిపించడం లేదు. ప్రవేశాల సంఖ్య అంతంత మాత్రంగానే ఉంది. గత ప్రభుత్వాల హయాంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆంగ్ల బోధన అందించడం కోసం 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదివేలా ఆదర్శ పాఠశాలలు ప్రారంభించింది. లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో చదివేందుకు మొదట్లో చాలా మంది విద్యార్థులు పోటీ పడేవారు. ప్రవేశార్హత పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికే అడ్మిషన్ దొరికేది. కానీ గత మూడేళ్లుగా పాఠశాలలో అడ్మిషన్లకు పెద్దగా పోటీ ఉండటం లేదు. గడిచిన ఏడాది, రెండేళ్ల నుంచి అయితే ప్రవేశాల గురించి పట్టించుకున్న నాథుడే లేడు. పాఠశాలలో ప్రిన్సిపాల్, సిబ్బంది సమన్వయ లోపంతో, తరచూ ఏదో వివాదం నెలకొనడం, అది బయటికి పొక్కడంతో, పాఠశాలపై కొంతమందికి నమ్మకం లేకుండా పోయింది. వివాదాలు జరిగినప్పుడు ఉన్నతాధికారులు, పాఠశాలను సందర్శించి వెళ్లడమే తప్పా, చక్కదిద్దలేదు. దీంతో ఈ విద్యా సంవత్సరంలో అయితే అడ్మిషన్ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. కొత్తగా అడ్మిషన్లు చేరేందుకు వెనకా ముందు ఆలోచిస్తున్నారు. ఉన్న వాళ్లలో కొంత మంది టీసీలు తీసుకుని వెళ్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు దృష్టి సారించకుంటే పాఠశాల పరిస్థితి అధ్వానంగా తయారయ్యేలా కనిపిస్తుంది. ఒకప్పుడు 750మంది విద్యార్థులతో కళకళలాడిన లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో ప్రస్తుతం 409మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. పాఠశాలలో అడ్మిషన్లు తగ్గడం పై పాఠశాల ప్రిన్సిపాల్ అనీలాను 'సాక్షి' సంప్రదించగా ఆమె పలు కారణాలు వెల్లడించారు. పాఠశాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం లేకపోవడం, తాగునీటి వసతి సరిగ్గా లేదని, ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం అందుబాటులోకి రావడంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత పాఠశాలలకు పంపిస్తున్నారని చెప్పారు. హాస్టల్ ప్రారంభం కాకపోవడంతో, ఇంటర్‌లో అడ్మిషన్లు తక్కువగా వచ్చాయని పేర్కొన్నారు.

తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్య ఇలా..

తరగతి	అందుబాటులో ఉన్న సీట్లు	ప్రవేశం పొందిన విద్యార్థులు
6	100	35
7	100	40
8	100	47
9	100	68
10	100	73

ఇంటర్ ప్రథమ సంవత్సరం 120మందికి, ప్రస్తుతం 48మంది, సెకండియర్‌లో 120మందికి 98మంది విద్యార్థులు ఉన్నారు.

క్లుప్తంగా

శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్



ఫాగింగ్ చేయిస్తున్న కమిషనర్

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో బుధవారం మున్సిపల్ కమిషనర్ ఫాగింగ్ చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ.. వర్షాకాలం సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడడానికి దోమల నివారణ ఎంతో ముఖ్యమన్నారు. డ్రైయినేజీలలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, కాలనీల్లో చెత్త పేరుకుపోకుండా చూడాలని, డ్రైయినేజీల్లో పూడిక ఉన్నట్లైతే సమాచారం అందించాలని తెలిపారు.

వారసులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలి



చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో కొన్నేళ్లుగా వివిధ విభాగాల్లో పనిచేస్తూ, వయస్సు పైబడిన కార్మికుల స్థానంలో వారి వారసులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ తెలంగాణ మున్సిపాలిటీ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవునూరి గోపాల్, కార్మికులు పాల్గొన్నారు.

గొల్లవాగు ప్రాజెక్ట్ కాలువ నీటిని విడుదల చేయాలి



డీఈకి వినతిపత్రం ఇస్తున్న రైతులు

భీమారం: వర్షాకాలం పంటసాగు కోసం వెంటనే గొల్లవాగు ప్రాజెక్ట్ కాలువ ద్వారా సాగు నీటిని విడుదల చేయాలని గొల్లవాగు ప్రాజెక్ట్ డీఈ ప్రవీణ్ కుమార్‌కు బుధవారం భీమారం, ఆర్కెపల్లి గ్రామ శివారులోని రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు రైతులకు సంఘీభావంగా వెళ్లిన జిల్లా కాంగ్రెస్ నాయకులు చేకూర్తి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ఒక వైపు వర్షాలు కురుస్తున్నాయని, ఈ నేపథ్యంలో అంతటా ఖరీఫ్ సీజన్ పనులు చేపట్టారన్నారు. అయితే ప్రతి సంవత్సరం గొల్లవాగు కాలువ నీటి విడుదల ఆలస్యం కావడంతో, పంట కాలం మరింత ఆలస్యం అవుతుందన్నారు. సకాలంలో పంట సాగు చేసుకునేందుకు రైతులకు అధికారులు సహకరించాలని ఆయన కోరారు.

'అధికారులూ మా భూమి మాకు ఇప్పించండి'

చెన్నూర్: పట్టణ శివారులో గల 869/3, 862 సర్వే నంబర్‌లో గల మా వంశ పారంపర్యంగా వస్తున్న 4.15ఎకరాల పట్టా భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసి మాపై దౌర్జన్యం చేస్తున్నారని, అధికారులు స్పందించి మా భూమిని మాకిప్పించండని చెన్నూర్ పట్టణానికి చెందిన ఒడ్డి మల్లక్క కుమారులు ఒడ్డి రవికుమార్, బాపు, సాంబయ్య అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మా తాతల కాలం నుంచి మాకు వస్తున్న భూమిని కొందరు ఆక్రయించి మాపై దాడులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఇప్పటికీ స్థానిక అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రికార్డులు పరిశీలించి మాకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఒడ్డి మల్లక్క కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జైపూర్: మంచిర్యాల లయన్స్ క్లబ్, బెల్లంపల్లి లయన్స్‌క్లబ్ విజన్ కేర్ బెల్లంపల్లి ఆధ్వర్యంలో నిర్వహించనున్న నేత్ర చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వనజారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఈ నెల 15న రేకూర్తి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యాలయంలో బుధవారం శిబిరానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు.

ఆశ కార్యకర్తల డిమాండ్లు నెరవేర్చాలి



చెన్నూర్: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి

మందమర్రిరూరల్: ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ ఆఫీస్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆశ వర్కర్లు ఆందోళన నిర్వహించి అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందించారు.

తాండూర్: కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం డిమాండ్ చేశారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ధర్నా నిర్వహించారు.

కోటపల్లి: బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కోటపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలు నిరసన చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు అందజేశారు.

చెన్నూర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేట్ విధానాలను నిరసిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు నిరసన తెలిపారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ సనత్ కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు చందు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు సరోజ, లక్ష్మి, శారద, విజయ, రాజేశ్వరీ, సుమతీ, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు

బెల్లంపల్లి: మహిళా సంఘాల సభ్యులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న తమకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయాలని బెల్లంపల్లి మండల వీవోఏలు డిమాండ్ చేశారు. డిమాండ్ డే ను పురస్కరించుకుని బుధవారం తహసీల్దార్ కేవై ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి మండల వీవోఏలు ఉన్నారు.

'జీవనోపాధిని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్ ఉత్పత్తులు'



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బాపు

బెల్లంపల్లి: ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీతో ఆదివాసీ ఎరుకల సామాజిక వర్గం జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆదివాసీ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్యాల బాపు అన్నారు. బెల్లంపల్లిలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం జరిగిన అసెంబ్లీ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తరాల నుంచి పందుల పెంపకం జీవనాధారంగా ఎంచుకుని బ్రతుకుతుండగా ప్రపంచీకరణ, ప్రైవేటీకరణలతో కుల వృత్తి అంతరించే ప్రమాదం ముందుకొస్తోందన్నారు. జిల్లాలో 3వేల కుటుంబాలు ఉన్నాయన్నారు. వీరికి గిరిజన సంక్షేమ శాఖ తరఫున ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుకావడం లేదన్నారు. జీవనోపాధి కోల్పోయిన వారికి పందుల పెంపకం కోసం పట్టణ, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఐదెకరాల చొప్పున ప్రభుత్వ భూమి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఆదివాసీ ఎరుకల సంఘం మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి మల్లేష్, నాయకులు ముత్తయ్య, దుర్గమ్మ, మధునమ్మ, రామక్క, సుల్తాన్ సంతోష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



జైపూర్: మాట్లాడుతున్న ఎస్సై శ్రీధర్

మందమర్రిరూరల్: స్థానిక మోడల్ స్కూల్లో విద్యార్థినులకు మంచిర్యాల షీ టీం, భరోసా సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం లైంగిక నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, ఫోక్సో, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, వరకట్న చట్టాల గురించి వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానం వచ్చినా టోల్ ఫ్రీ నంబర్ 1930, రామగుండం కమిషనరేట్ పరిధి షీ టీం నంబర్ 63039 23700కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి, మహిళా కానిస్టేబుల్ జ్యోతి, కానిస్టేబుల్ శ్రావణ్‌కుమార్, సతీష్, భరోసా సెంటర్ సిబ్బంది విజయ, ప్రియాంక, సిబ్బంది తదితరులు ఉన్నారు.

జైపూర్: స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం సైబర్ నేరాలపై ఎస్సై శ్రీధర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రత్యేక అధికారి ఫణిబాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీ



ఉపాధ్యాయులు, విద్యార్థులతో రాష్ట్ర పరిశీలకుడు

కాసిపేట: మండలంలోని లంబాడితండా(ఎస్) ప్రాథమిక పాఠశాలను ఎస్‌సీఆర్‌టీ రాష్ట్ర పరిశీలకుడు జె.శ్రీనివాస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, రికార్డులు పరిశీలించారు. అనంతరం లంబాడితండా(ఎస్) జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఎస్ఆర్‌టీ విద్యాసాగర్‌రావు, జెడ్పీహెచ్ఎం లచ్చయ్య, ప్రైమరీ హెచ్ఎం కట్ట వాణికుమారి, ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, సురేష్, శ్రీకాంత్, వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ చైర్మన్‌కు ఘనస్వాగతం

దండేపల్లి: తెలంగాణ రాష్ట్ర గిరిజన కో–ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన దండేపల్లి మండలం అల్లీపూర్‌కు చెందిన కోట్నాక తిరుపతి బుధవారం హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అక్కడి నుంచి సాయంత్రం స్వగ్రామానికి రావడంతో మండలంలోని గూడెం వద్ద, స్థానిక నాయకులు, గిరిజనులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి తాళ్లపేట వరకు నాయకులు, అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

చిత్రలేఖనం పోటీలు

తాండూర్: మండలంలోని విద్యాభారతి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. స్వచ్ఛ పక్వాడా 2024కార్యక్రమంలో భాగంగా భారత్ పెట్రోలియం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి అనే అంశంపై బుధవారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో 120మంది విద్యార్థులు పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తామని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

భాషా పండితులకు ప్రమోషన్లు ఇవ్వడం హర్షనీయం

చెన్నూర్‌రూరల్: ప్రభుత్వం భాషా పండితులకు ప్రమోషన్లు ఇస్తూ బదిలీ చేయడం హర్షనీయమని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సత్యనారాయణచారి అన్నారు. మండలంలోని అంగ్రాజ్‌పల్లి, కొమ్మెర, ఆస్నాద, నాగాపూర్, కొమ్మెర, సుద్దాల, దుగ్నెపల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు.

వేతనాలు మంజూరు చేయాలని వినతి

భీమారం: మండలంలోని 11గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు ఆరునెలల వేతనాలు చెల్లించాలని బుధవారం ఎంపీవో బాపురావుకు కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఆరు నెలలుగా వేతనాలు లేక నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. ఈ విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకొని వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అటెన్షన్ ప్లీజ్.. నిరుపయోగంగా ట్రాన్స్‌ఫార్మర్



భీమారం: మండల కేంద్రంలోని అటవీశాఖ ఆధ్వర్యంలో కలప డిపో కోసం మంజూరైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గత సంవత్సరం నుంచి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా ఉంది. భీమారంలో అటవీశాఖ ఆధ్వర్యంలో కలప డిపో వద్ద విద్యుద్దీకరణ కోసం 30ఏళ్ల క్రితం ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్తు శాఖ బిగించింది. కానీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి డిపోలోని స్తంభాలకు కనెక్షన్ ఇవ్వకపోవడంతో అది వృథాగా ఉంటోంది. అయితే అటవీశాఖ అధికారులు సోలార్ లైట్లు వినియోగిస్తున్నారు. మరిన్ని రోజులు అలాగే ఉంటే చోరీకి గురయ్యే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. ఈ విషయంలో అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిచో ప్రభుత్వ సొమ్ము దొంగల పాలయ్యే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

సంబంధిత అధికారి: సతీష్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి, భీమారం ఫోన్ నంబర్ : 97018 16120

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- ఏసీపీ ప్రకాష్
- గాంధీనగర్‌లో నిర్బంధ తనిఖీలు



ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాష్

మంచిర్యాలక్రైం: పట్టణంలోని గాంధీనగర్‌లో బుధవారం ఉదయం 5గంటల నుంచి 7గంటల వరకు రెండు గంటల పాటు 50మంది ప్రత్యేక పోలీస్ బలగాలతో రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు, స్థానిక డీసీపీ భాస్కర్ ఆదేశాల మేరకు ఏసీపీ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్బంధ తనిఖీలు (కార్డెన్ అండ్ సెర్చ్) నిర్వహించారు. ఈ తనిఖీల్లో నంబర్ ప్లేట్ లేని 60 ద్విచక్ర వాహనాలు, 5ఆటో ట్రాలీలను గుర్తించి అక్కడికక్కడే వాటిని సరిచేశారు. అనుమానాస్పదంగా ఉన్న వారి ఆధార్ కార్డులు పరిశీలించి వారి వివరాలు సేకరించారు. వాహనపత్రాలు తనిఖీ చేశారు. అనంతరం కాలనీ ప్రజలతో సమావేశం నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వ నిషేధిత వస్తువులు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి వినియోగం, సైబర్ క్రైం, షీ టీమ్స్, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవించాలంటే పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సీఐ బన్సీలాల్, ఎస్సైలు సనత్‌కుమార్, మహేందర్, సుబ్బారావు సిబ్బంది పాల్గొన్నారు.

పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలి

నెన్నెల: పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని నేతకాని(మహర్) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సయ్య డిమాండ్ చేశారు. మన్నెగూడెంలో బుధవారం ఆయన నేతకాని కుల ఆత్మగౌరవ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గోదావరి పరీవాహక ప్రాంతమైన ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు ఆదివాసీ, ఎస్సీ, బీసీ రైతులు పోడు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారని అన్నారు. పట్టాలు లేక, ఏజెన్సీ ప్రాంతంలో పహాణీలు రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నేతకాని కులస్తుల అభివృద్ధి కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం మండల అధ్యక్షుడు గట్టు బానేష్, గ్రామ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు గట్టు రాజయ్య, శివలింగయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

కస్తూర్బా కళాశాలలో వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు



వన మహోత్సవాన్ని తెలిపేలా చెట్టు ఆకారం

చెన్నూర్: పట్టణంలోని కస్తూర్బా కళాశాలలో వన మహోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. వన మహోత్సవ ఉత్సవాన్ని తెలియజేసే విధంగా చెట్ల కొమ్మలతో చెట్టును తయారు చేశారు. విద్యార్థులు వన మహోత్సవం సందర్భంగా తయారు చేసిన చెట్టు ఆకారం అందరినీ ఆకర్షించింది. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సుమలత, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యార్థి దినోత్సవం



విద్యార్థులతో మొక్క నాటుతున్న ఏబీవీపీ శ్రేణులు

బెల్లంపల్లి: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) 76వ ఆవిర్భావ దినోత్సవం, జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని బుధవారం బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దీపక్‌కుమార్, బెల్లంపల్లి పట్టణ ఏబీవీపీ సెక్రెటరీ సూర్య, జాయింట్ సెక్రెటరీ కార్తికేయ, పాఠశాల ప్రిన్సిపాల్ సంజీవ్, పీఈటీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

జైపూర్: నేరాల నియంత్రరణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోపడుతాయని వ్యాపారస్తులు తమ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. జైపూర్ మండలం రసూల్‌పల్లిలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఏసీపీ వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్సై శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు.

సంక్షిప్త వార్తలు

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

శ్రీరాంపూర్: బొగ్గు గనుల వేలంను నిరసిస్తూ సీఐటీయూ నాయకులు బుధవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డీజీఎం(పర్సనల్) అరవిందరావును కలిసి వినతిపత్రం అందించారు.

గడ్డి విత్తనాలు పంపిణీ

జన్నారం: మండలంలోని వివిధ గ్రామాల రైతులకు బుధవారం గడ్డి విత్తనాలు (మేలు జాతి మొక్కజొన్న, పశుగ్రాసం) పంపిణీ చేసినట్లు పశువైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. 19క్వింటాళ్ల మేలు తి గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమున్న వారు సంప్రదించాలని సూచించారు.

సేవా కార్యక్రమాలతో గుర్తింపు..

దండేపల్లి: సేవా కార్యక్రమాలు చేయడంతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం శంకర్‌గౌడ్ అన్నారు. దండేపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థను బుధవారం ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో పలకలు, బలపాలు, నోట్‌బుక్‌లు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు చెన్నవేని భాను, పసుపునూటి సాయిరాం, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోచమ్మతల్లికి పూజలు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాలలోని ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా పోచమ్మతల్లికి పూజలు నిర్వహించారు. అష్టోత్తర శతకట కళాభిషేకం, చండీ హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పుస్తకాలు, సరుకులు అందజేత

మంచిర్యాలటౌన్: పట్టణంలోని శ్రీశ్రీనగర్‌లో గల రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిల్లల అనాథ ఆశ్రమానికి నేత్ర వైద్య నిపుణురాలు వి.జ్యోతిర్మయి బుధవారం 18మంది పిల్లలకు రూ.12వేల విలువ గల పుస్తకాలు, టూత్‌పేస్ట్, బ్రష్, హెయిర్ ఆయిల్‌ను విరాళంగా అందించారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

కోటపల్లి: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతీరోజు గ్రామాల్లో పారిశుధ్య పనులు తప్పక చేపట్టాలని ఎంపీవో సత్యనారాయణ కార్యదర్శులకు సూచించారు. వెంచపల్లి గ్రామపంచాయతీని బుధవారం సందర్శించి దోమల నివారణకు సూచనలు చేశారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.